సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



అంగన్‌వాడీల సమ్మెబాట

తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం నుంచి సమ్మెబాట పడుతున్నారు. 8లో



ఆయిల్‌పాం రైతులకు సౌకర్యాలు

ఆయిల్‌పాం రైతులకు సౌకర్యాల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
30°/ 24°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

పాల్వంచరూరల్ : శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుని ఒడిబియ్యం, తలనీలాలు, చీరలు, పసుపు, కుంకుమతో పాటు బోనాలు, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

12న ఏఈ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో అసిస్టెంట్ ఇంజనీర్(ఈ అండ్ ఎం) గ్రేడ్–2 ఇంటర్నల్ అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్లను ఈనెల 12న పరిశీలించనున్నట్లు సంస్థ రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. సంస్థలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ 24 పోస్టులకు ఆగస్టు 6న రాతపరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షకు 573 మంది హాజరుకాగా, 441 మంది క్వాలిఫై అయ్యారని తెలిపారు. అయితే, కొందరు మహిళా అభ్యర్థులు ప్రత్యేక కోటా కేటాయించాలని కోర్టును ఆశ్రయించగా, ఎనిమిది పోస్టులు మినహా మిగిలిన 16 పోస్టులకు సంబంధించి ప్రక్రియ చేపట్టవచ్చని ఆదేశించిందని చెప్పారు. దీంతో ఈనెల 12న అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి, వైద్యపరీక్షల అనంతరం నియామకాలు చేపడుతామని జీఎం తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులు సెల్ ఫోన్లకు మెసేజ్ పంపినందున కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు.

నేడు పీఆర్ ఇంజనీర్ కార్యాలయం ప్రారంభం




పంచాయతీరాజ్ కార్యాలయం

పాల్వంచరూరల్ : ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పంచాయతీరాజ్ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయాన్ని స్థానిక పాత ఆర్టీఓ ఆఫీస్‌లో ఏర్పాటుచేయగా సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈ వి.సత్యనారాయణ తెలిపారు.

నేడు బెళగావి రైలు రద్దు

కొత్తగూడెంఅర్బన్: బెళగావి నుంచి మణుగూరు వరకు రాకపోకలు సాగించే బెళగావి రైలును సోమవారం రద్దు చేసినట్లు భద్రాచలం రోడ్ రైల్వేస్టేషన్ చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ జేమ్స్‌పాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయాణికులు గమనించి రైల్వే శాఖకు సహకరించాలని కోరారు.

సఖ్యత కుదిరేనా?



ఇల్లెందు బీఆర్‌ఎస్‌లో చల్లారని అసమ్మతి

- ఎడముఖం పెడముఖంగా పార్టీ నేతలు
- నేడు భేటీకి హాజరవుతున్న ఎంపీ రవిచంద్ర

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీలో అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉంది. తీవ్ర ఉత్కంఠ మధ్య టికెట్ దక్కించుకున్న హరిప్రియానాయక్‌కు.. ఇక్కడ నెలకొన్న అసమ్మతిని చల్లార్చడం కష్ట సాధ్యంగా మారింది. దీంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర పర్యటనలో అసమ్మతి అంశం కీలకంగా మారనుంది.

అసమ్మతి సెగలు

గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన హరిప్రియ ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన కోరం కనకయ్యకు ఈ పరిణామం ఇబ్బందిగా మారింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిషత్, మున్సిపల్ తదితర స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయఢంకా మోగించింది. దీంతో ఒక్కసారిగా నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ హవానే కొనసాగింది. దీనికి సమాంతరంగా అసమ్మతి కూడా రాజుకుంది. కోరం కనకయ్య ఎమ్మెల్యేగా ఓడిపోయినా ఆ తర్వాత జిల్లా పరిషత్ చైర్మన్ పదవి వరించింది. అయితే నియోజకవర్గంలో ఆయన మాట పెద్దగా చెల్లుబాటు కాకపోడంతో చివరకు పార్టీని వీడి బయటకు వెళ్లారు. ఆయనతో పాటు కొంత కేడర్ కూడా వెళ్లిపోయింది, ఇది చాలదన్నట్టుగా... గత ఆరు నెలలుగా ఇల్లెందు మున్సిపాలిటీతో పాటు గార్ల, బయ్యారం, కామేపల్లి మండలాల్లోనూ ఎమ్మెల్యే హరిప్రియకు వ్యతిరేక వర్గాలు తయారయ్యాయి. హరిప్రియకు మరోసారి టికెట్ కేటాయించవద్దంటూ అసమ్మతి వర్గం నేతలు పార్టీ పెద్దలను కోరారు. అయితే.. అనేక మలుపుల అనంతరం హరిప్రియ పైనే కేసీఆర్ నమ్మకం ఉంచడంతో ఒక అంశానికి తెరపడింది.

ఎవరికి వారే

టికెట్ దక్కించుకున్న తర్వాత అసమ్మతి నేతలందరినీ కలుపుకునిపోతానని హరిప్రియ నాయక్ ప్రకటించారు. మరోవైపు కారు గుర్తుపై పోటీ చేసే అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని, పార్టీ అధిష్టానం నిర్ణయమే తమకు శిరోధార్యమని అసమ్మతి నేతలూ చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఆగస్టు 21న అభ్యర్థుల ప్రకటన వెలువడితే సెప్టెంబర్ 10వ తేదీ వరకూ ఇరు వర్గాలు ఎడముఖం పెడముఖంగానే వ్యవహరిస్తూ వస్తున్నాయి. ఇల్లెందు బస్ డిపో ప్రారంభోత్సవం మినహా మిగిలిన అన్ని అధికారిక, పార్టీ కార్యక్రమాలను ఎవరికి వారుగా చేపడుతూ వస్తున్నారు. రక్షాబంధన్ పండగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలకు ఎమ్మెల్యే హరిప్రియ ప్రతీ ఏడాది రాఖీలు కడుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న విబేధాల ప్రభావం ఈ సారి రాఖీలోనూ కనిపించింది. అసమ్మతి నేతలు ఈ కార్యక్రమానికి కూడా దూరంగా ఉన్నారు. నియోజకవర్గంలో తమకు ఎదురవుతున్న ఇబ్బందులపై పార్టీ పరంగా స్పష్టమైన వివరణ, హామీ వచ్చిన తర్వాతే యాక్టివ్ అవ్వాలనే యోచనలో అసమ్మతి నేతలు ఉన్నారు.

వద్దిరాజు వస్తున్నారు

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నియమితులయ్యారు. ఈ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇటీవల కొత్తగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అప్పటివరకు కొత్తగూడెంలో కనిపించిన గ్రూపు రాజకీయాలన్నీ అభ్యర్థుల జాబితా ప్రకటన, అనంతరం వద్దిరాజు ర్యాలీతో సద్దుమణిగాయి. వద్దిరాజు మలి పర్యటనగా సోమవారం ఇల్లెందుకు వస్తున్నారు. కొత్తగూడెం తరహాలోనే పార్టీ అభ్యర్థిగా ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియానాయక్‌కు, అసమ్మతి నేతలకు నడుమ సయోధ్య సాధిస్తారా? లేక ఈ అసమ్మతి ఎపిసోడ్ మరికొంత కాలం కొనసాగుతుందా? అనేది నేడు తేలనుంది.

నేటితో ముగియనున్న శ్రీమద్భాగవత హవనం

రామయ్యకు వైభవంగా సువర్ణపుష్పార్చన



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహ హవనం సోమవారంతో ముగియనుంది. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా చిత్రకూట మండపంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో హోమం, భాగవత పారాయణ హవనం నిర్వహిస్తుండగా ఆదివారం నాటి పూజల్లో ఆలయ ఈఓ రమాదేవి పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం ముగింపు వేడుకల సందర్భంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు చిత్రకూట మండపంలో శ్రీ రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణోత్సవం ఉంటుందని ఈఓ తెలిపారు.

స్వామివారికి సువర్ణపుష్పార్చన

అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పల్లకీ సేవగా బేడా మండపానికి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

'గుర్తింపు' ఎన్నికలపై నేడు సమావేశం

- ఎన్నికల నిర్వహణకు సింగరేణి విముఖత
- రెండేళ్లుగా కొనసాగుతున్న వాయిదాల పర్వం
- మరోసారి ప్రక్రియ ప్రారంభించిన కార్మిక శాఖ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ అంశం ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్టుగా మారింది. ఇప్పటికే మూడుసార్లు ఎన్నికల నిర్వహణ వాయిదా పడింది. తాజాగా నాలుగో ప్రయత్నంగా ఇదే అంశంపై కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించేందుకు కేంద్ర కార్మిక శాఖ సిద్ధమైంది. ఈ మేరకు కార్మిక సంఘాలు, సింగరేణి అధికారులతో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లో సమావేశం జరుగనుంది. ఇందులో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలి, ఓటర్ల జాబితా ఎప్పుడు ప్రకటించాలి తదితర అంశాలపై చర్చించనున్నారు.

రెండేళ్లుగా వాయిదా

సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు తొలిసారిగా 1998లో జరగగా, చివరిసారి 2017 అక్టోబర్‌లో నిర్వహించారు. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గెలుపొందింది. ఈ సంఘం గుర్తింపు కాలపరిమితి 2021తో ముగిసింది. వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా వివిధ కారణాలతో సింగరేణి యాజమాన్యం వాయిదా వేస్తూ వస్తోంది. ఈ అంశంపై సీపీఐ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ యూనియన్ (ఏఐటీయూసీ) హై కోర్టును ఆశ్రయించింది. అక్కడ కార్మిక సంఘాలకే అనుకూలంగా తీర్పు వచ్చినా వివిధ సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ సింగరేణి సంస్థ ఎన్నికలు వాయిదా వేస్తోంది. బీఆర్‌ఎస్ సర్కార్ ఆదేశాల మేరకే ఎన్నికల నిర్వహణలో వెనుకంజ వేస్తోందనే విమర్శలు సంస్థపై ఉన్నాయి.

కారు జోరుకు బ్రేకులు..

ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో సింగరేణి బొగ్గు గనులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఈ సంస్థలో 42 వేల మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సింగరేణికి సంబంధించిన అంశాలు గెలుపోటములను ప్రభావితం చేసే పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 2014, 2018లో రెండుసార్లు జరిగిన సాధారణ ఎన్నికల్లో మిగిలిన ప్రాంతాల్లో కారు పార్టీ జోరు చూపించింది. కానీ కోల్‌బెల్ట్ ఏరియాల్లో మాత్రం ఆ పార్టీకి భంగపాటు ఎదురైంది. దీంతో గత రెండేళ్లుగా గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వస్తే రానీ.. పోతే పోనీ..

సింగరేణి ఎన్నికల నిర్వహణ విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ వైఖరిలో ఇటీవల మార్పు వచ్చిందంటున్నారు. ఇప్పటికే కమ్యూనిస్టులతో తెగదెంపులు చేసుకున్న బీఆర్‌ఎస్.. తొలి జాబితా ప్రకటన తర్వాత అసమ్మతి నేతలు పార్టీని వీడి వెళ్తున్నా డోంట్ కేర్ అన్నట్టుగా వ్యవహరిస్తోంది. ఇదే తీరుగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నిక విషయంలోనూ ఏదైతే అదే జరగనీ అనే భావన పార్టీలో నెలకొందని బీఆర్‌ఎస్ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలను కేంద్ర కార్మిక శాఖ చూసుకుంటుందని, అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకు తగ్గట్టుగా ముందుకు పోవడమే మంచిదనేది గులాబీ నేతల అభిప్రాయంగా చెబుతున్నారు.

నేడు మిషన్ ఇంద్రధనుష్ - 2 ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: మిషన్ ఇంద్రధనుష్ –2 కార్యక్రమాన్ని జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శిరీష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వ్యాక్సిన్ వేయించుకోని వారి కోసం ఈ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 1,364 మంది పిల్లలకు, 212 మంది గర్భిణులకు వ్యాక్సినేషన్ చేయనున్నట్లు ఆమె వివరించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోట్ షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన పర్యాటకులు ఆదివారం కిన్నెరసానిలో సందడి చేశారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల మధ్య గడిపారు. 652 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.18,465, 210 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.10,880 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కేసీఆర్‌ను ఇంటికి పంపాల్సిందే

- రాష్ట్రం ఏర్పాటు తర్వాత కల్వకుంట్ల కుటుంబమే బాగుపడింది
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సభలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస రెడ్డి

పాల్వంచ : కేసీఆర్‌ను ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమైందని, లేకుంటే దేవుడు కూడా మనల్ని క్షమించడని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాల్వంచ అయ్యప్పనగర్‌లో ఏర్పాటు చేసిన క్యాంప్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తవిశలగూడెం సర్పంచ్ కొమురం రాణి, కొమురం నర్సింహారావు, పాండురంగాపురం సర్పంచ్ బొబ్బల జీవన్ రెడ్డి, ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి సర్పంచ్ భిక్షం కాంగ్రెస్‌లో చేరగా, వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో, ఆ తర్వాత విలేకరులతో పొంగులేటి మాట్లాడుతూ.. ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం జరుగుతుందని, పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, పీసీసీ, సీఎల్పీ నేతలు హాజరవుతారని వివరించారు. 17వ తేదీన కనీవినీ ఎరుగని రీతిలో బహిరంగ సభ జరుగుతుందని, సభకు జిల్లా నుంచి భారీగా పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలు చేసే కార్యక్రమాలపై సభలో ఐదు డిక్లరేషన్లు ప్రకటిస్తారని తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచి, బీఆర్‌ఎస్‌లోకి వెళ్లిన ప్రతి ఎమ్మెల్యేపై చార్జ్‌షీట్ వేస్తామని చెప్పారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కేసీఆర్ విస్మరించారని, ప్రస్తుతం ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. ఆయన అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం మాత్రమే బాగుపడిందని, ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే స్వర్ణయుగంగా మారుస్తామని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నాగ సీతారాములు, ఊకంటి గోపాల్‌రావు, జాలే జానకీ రెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, తుమ్మల శివారెడ్డి, తూము చౌదరి, అళ్ల మురళి, లక్కినేని సురేందర్, లక్కినేని సాయి, వానపాకుల రాంబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెబాట

- జిల్లాలో నేటి నుంచి టీచర్లు, ఆయాలు విధులకు గైర్హాజరు
- వేతనం, గ్రాట్యుటీ పెంచాలని డిమాండ్
- సమ్మెకు దూరంగా మినీ అంగన్‌వాడీలు



కొత్తగూడెంటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ టీచర్లు సోమవారం నుంచి సమ్మెబాట పడుతున్నారు. దీంతో జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని, టీచర్లకు నెలకు రూ.26 వేల వేతనం, ఆయాలకు నెలకు రూ.20 వేల వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలకు పెంచాలని, ఈఎస్‌ఐ సదుపాయం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ విరమణ అనంతరం వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమ్మె నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడకుండా తాళాలు అప్పగించాలని, ఆర్పీలు, ఆశ వర్కర్లతో నడిపిస్తామని ఐసీడీఎస్ అధికారులు అంటుండగా అందుకు టీచర్లు, ఆయాలు నిరాకరిస్తుండడంతో సోమవారం నాటి నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది.

సమ్మెలోకి 2,918 మంది..

జిల్లా వ్యాప్తంగా 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 1,434 ప్రధాన, 636 మినీ సెంటర్లున్నాయి. ప్రధాన కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, ఆయాలు మొత్తం 2,918 మంది నేటి నుంచి సమ్మెలోకి దిగుతున్నారు. మినీ కేంద్రాల్లో పనిచేసే వారు మాత్రం సమ్మెకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాల పరిధిలోని చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందడం కష్టంగా మారనుంది. జిల్లాలో మూడేళ్ల లోపు పిల్లలు 45,201 మంది, మూడు నుంచి ఆరేళ్ల లోపు వారు 17,846 మంది, గర్భిణులు 5,078 మంది, బాలింతలు 5,299 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరికి ప్రస్తుతం సమయానికి పౌష్టికాహారం అందుతుండగా, అంగన్‌వాడీల సమ్మెతో ఇబ్బందులు కలుగనున్నాయి. అయితే అంగన్‌వాడీలకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా.. ఫలించేలా కనిపించడం లేదు.

సమ్మె చేస్తే చర్య తప్పదు..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మె చేయకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని ఐసీడీఎస్ అధికారులు అంటున్నారు. కేంద్రాల తాళాలు తమకు అప్పగించకుండా సమ్మెలోకి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. సమ్మెతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడతారని చెబుతున్నారు. కేంద్రాల తాళాలు తమకు అప్పగిస్తే ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని అంటున్నారు.

డిమాండ్లు అమలు చేయాలి



సమాన పనికి సమాన వేతనాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అంగన్‌వాడీలకు రూ.13,600 నుంచి రూ. 26 వేలకు వేతనం పెంచాలి. ఆయాలకు రూ.7,500 నుంచి రూ.20 వేలకు పెంచాలి. మాకు ఉద్యోగ భద్రతతో పాటు విరమణ అనంతరం బెనిఫిట్స్ సక్రమంగా అందించాలి. ప్రభుత్వం దిగివచ్చి మా సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తాం.

– గోనె మణి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఉపాధ్యక్షురాలు

ఆయిల్‌పాం రైతులకు సౌకర్యాల కల్పనపై దృష్టి

- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే మెచ్చా
- ఫ్యాక్టరీల్లో పలు భవనాల ప్రారంభోత్సవం



అశ్వారావుపేట రూరల్ : ఆయిల్‌ఫెడ్ విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మెచ్చా, చైర్మన్ రామకృష్ణారెడ్డి

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం సాగు విస్తరణకు కృషి చేస్తూనే ఫ్యాక్టరీల్లో రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తెలిపారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ నర్సరీ ఆవరణలో రూ.1.38కోట్లతో నిర్మించిన విశ్రాంతి భవనం, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద రైతుల కోసం రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన ఫార్మర్ షెడ్‌ను ఆయన ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట సాగు విస్తరణతోపాటు, గెలల క్రషింగ్ కోసం నూతనంగా ఫ్యాక్టరీలను నిర్మిస్తున్నామని అన్నారు. దీర్ఘకాలిక ఆదాయాన్ని అందించే ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారని తెలిపారు.

అప్పారావుపేటలో...

దమ్మపేట: దమ్మపేట మండలం అప్పారావుపేటలో ని పామాయిల్ ఫ్యాక్టరీలో వ్యర్థాలను శుద్ధి చేసే(ఎంఈఈ) ప్లాంట్, రైతుల విశ్రాంతి భవనాన్ని ఆది వారం తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ సాగును పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్న నేపథ్యాన ప్లాంట్ విస్తరిస్తున్నట్లు తెలిపారు. తొలుత మండల కేంద్రంలోని శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో రూ.30 లక్షల వ్యయంతో కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈకార్యక్రమాల్లో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, మేనేజర్(ప్రాజెక్ట్స్) శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్లు బాలకృష్ణ, కల్యాణ్, అబ్దుల్ జిన్నా, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీలు పైడి వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, ఎంపీపీ శ్రీరామ్మూర్తి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్నతో పాటు చిట్టూరి ఫణీంద్ర, బీఆర్‌ఎస్ నాయకులు బండి పుల్లారావు, మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, జేకేవీ.రమణారావు, ప్రకాశ్‌రావు, ఎస్.ప్రసాద్, కాసాని చంద్రమోహన్, దారా యుగేందర్, దారా మల్లికార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీలో దరఖాస్తుల వెల్లువ

జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు 50 మందికి పైగా ఆశావహులు



చుంచుపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా బీజేపీ అభ్యర్థులుగా బరిలో నిలిచేందుకు పలువురు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈ నెల 4 నుంచి ఆదివారం దరఖాస్తులు స్వీకరించగా జిల్లా నుంచి 50 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కొత్తగూడెం నుంచి 15 మంది, పినపాక నుంచి 10 మంది, ఇల్లెందు నుంచి 15 మంది, అశ్వారావుపేట నుంచి 8 మంది, భద్రాచలం నుంచి నలుగురు చొప్పున అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. కొత్తగూడెం నియోజకవర్గం జనరల్ స్థానం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేవీ.రంగా కిరణ్, జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ అగర్వాల్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు, చిలుకూరి రమేష్, పాలిశెట్టి శ్రీనివాసరావు, కాసాని రమేష్, గుగులోతు రమేష్, తదితరులు ఉండగా, ఇల్లెందు నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, కుర్స సీతారాములు, హతీరాం నాయక్, రామచంద్ర నాయక్, బట్టు నాగేశ్వరరావు ఉన్నారు. పినపాక నియోజకవర్గం నుంచి దరఖాస్తు సమర్పించిన వారిలో భూక్య దివ్యశ్రీ, భూక్య సీతారాం నాయక్, భూక్య వెంకటేశ్వర్లు, భూక్య ప్రసాద్, భూక్య తార, పొద్య కేశవరావు, కొర్సా వెంకటేశ్వర్లు, బాలరాజు తదితరులు ఉన్నారు. అశ్వారావుపేట నుంచి మడకం రమేష్, భూక్య ప్రసాద్, గుగులోతు జ్యోతి, మడవి రవి, గుగులోతు రాజేష్ , భద్రాచలం నుంచి మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి, చెరుకూరి సతీష్ కుమార్, నక్క కన్నారావు, పొడియం నరసింహారావు దరఖాస్తులు సమర్పించారు.

కాంట్రాక్ట్ కార్మికులను విస్మరించిన పాలకులు

ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి సూరయ్య



సదస్సులో మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి సూరయ్య

ఇల్లెందు: గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా అనుబంధ ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి కె.సూరయ్య, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య విమర్శించారు. ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కాంట్రాక్ట్ కార్మిక సదస్సులో వారు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని తెలిపారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేస్తానని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఆతర్వాత విస్మరించాడని ఆరోపించారు. సింగరేణిలోనూ కనీస వేతనాలు, సీఎంపీఎఫ్, వైద్యం అందడం లేదని తెలిపారు. కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో ఇఫ్టూ నాయకులు జి.రామయ్య, ఆర్.మధుసూదన్‌రెడ్డి, ఎస్.కిరణ్, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు యాకూబ్‌షావలీతో పాటు పాయం వెంకన్న, గురునాథం, తోకల రమేష్, పి.సతీష్, సీ.వై.పుల్లయ్య, శరత్, గౌస్, మల్సూర్, చంద్రశేఖర్, రాజశేఖర్, రమేష్, శాంతయ్య, శంకర్, సుందర్, వేల్పుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి... ఆపై వరకట్న వేధింపులు

ఆత్మహత్య చేసుకున్న వివాహిత

రఘునాథపాలెం: ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నారు. ఆతర్వాత నుండి భర్తత పాటు అత్తమామలు వరకట్నం కోసం వేధిస్తుండడంతో పురుగుల మందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందగా రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌కు చెందిన చంద్రిక(31), రఘునాథపాలెంకు చెందిన ఎ.ప్రవీణ్‌కుమార్ 2015 ఏడాదిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఐదేళ్ల కుమారుడు ఉండగా, గత ఏడాది కాలంగా భర్తతో పాటు అత్తామామలు లక్ష్మి, రమేష్ ఆమెను అనుమానిస్తూ అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. దీంతో ఆమె ఈనెల 2న ఇంట్లో ఎలుకల మందు తినగా, ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుండి హైదరాబాద్ తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో శనివారం ఖమ్మం తీసుకురాగా, చంద్రిక మృతి చెందింది. ఘటనపై ఆమె తండ్రి కొండల్‌రావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

సత్వరమే బదిలీలు చేపట్టాలి



మంత్రి సత్యవతికి వినతిపత్రం ఇస్తున్న రాములునాయక్

పాల్వంచ: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు నాయక్ కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో గిరిజన మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ తెలంగాణా హైకోర్టు తీర్పు ప్రకారం పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో సమానంగా రాష్ట్రంలోని ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు ఇవ్వాలన్నారు.

మోటివేషనల్ స్పీకర్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న రమేశ్

పాల్వంచ: పాల్వంచకు చెందిన కనకపూడి రమేశ్‌కు ఉత్తమ మోటివేషనల్ స్పీకర్ అవార్డు లభించింది. గంపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంపాక్ట్ ఫౌండేషన్‌లో శిక్షణ తీసుకున్న ఆయన పలు ప్రభుత్వ పాఠశాలల్లో వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. రమేశ్ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆదివారం సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో జరిగిన మెగా ఇంపాక్ట్ సదస్సులో లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా అవార్డు, సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో ఆదివారం ముగ్గురు మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో ఓ మహిళా మావోయిస్టు కూడా ఉంది. లొంగిపోయిన వారిలో న్యూ మార్నింగ్, న్యూ బిగినింగ్, బెటాలియన్ సభ్యురాలు కమ్లీ అలియాస్ కమ్లా, ఈస్ట్ బెటాలియన్ కంపెనీ సభ్యుడు దేవా, డీఏకేఎంఎస్ సభ్యుడు సన్ను ఉన్నారు. వారిపై రూ.8 లక్షల రివార్డు ఉందని, పునరావాసంలో భాగంగా వారికి ప్రోత్సాహకాలు అందించినట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్, కమాండింగ్ ఆఫీసర్ సురేష్ సింగ్ పాయల్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట: మండల పరిధిలోని మల్లారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, రూ.5,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

రాజాపురంలో..

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని రాజాపురం గ్రామ శివారులో పేకాటస్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షాహీన తెలిపారు.

ఇంటి రుణం పేరిట సైబర్ నేరగాళ్ల వల

పెనుబల్లి: ఓ యువకుడి అవసరాన్ని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు రూ.లక్షకు పైగా నగదు కాజేశారు. బాధితుడు పోలీసులకు అందజేసిన ఫిర్యాదులోని వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలం గట్టుగూడెంకు చెందిన కొర్సా అశోక్ తన సెల్‌కు వచ్చిన మెసేజ్ ఆధారంగా ఇండియా బుల్స్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకుని గృహరుణంగా రూ.8 లక్షలు కావాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఆతర్వాత అశోక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి రుణం మంజూరు కోసం తొలుత రూ.4,700 చెల్లించాలనడంతో ఆయన ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేశారు. అనంతరం మొదటి ఈఎంఐ రూ.36వేలు, ఇతర ఖర్చుల పేరిట రూ.1,10,000 వసూలు చేశారు. మళ్లీ శనివారం ఫోన్ చేసి ఇంకో రూ.7,500 చెల్లిస్తే రూ. 8లక్షల రుణంతో పాటు అదనంగా లక్షన్నర కలిపి రూ.9.50 లక్షలు అకౌంట్‌కు పంపుతామని చెప్పడంతో అనుమానించిన ఆయన మోసపోయినట్లుగా గుర్తించాడు. ఘటనపై ఆదివారం ఆన్‌లైన్ ద్వారా సైబర్ క్రైం పోలీసులతో పాటు వీఎం బంజర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కొర్సా అశోక్ తెలిపాడు.

బీఆర్‌ఎస్‌ది అవినీతి పాలన

బీజేపీ నాయకులు గరికపాటి, రవీందర్ నాయక్



మాట్లాడుతున్న గరికపాటి రామ్మోహన్‌రావు

ఇల్లెందు: రాష్ట్రంలో కుటుంబ, అవినీతి పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌ను ఓడించాలని బీజేపీ నాయకులు, మాజీ ఎంపీలు గరికపాటి రామ్మోహన్‌రావు, రవీందర్ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఇల్లెందులో ఐతా ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ బూత్ సమ్మేళనంలో వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ కేజీ టూ పీజీ ఉచిత విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, రుణమాఫీ, సబ్సిడీ ఎరువులు అందజేత, ఇంటికో ఉద్యోగం వంటి వాగ్దానాలు విస్మరించారని విమర్శించారు. రాష్ట్రంలో దోచుకున్నది సరిపోకపోగా ఢిల్లీ లిక్కర్ స్కాంలో కూతురు ద్వారా దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. రాష్ట్రంలో నాలుగు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తోందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని గెలిపించాలని కోరారు. రానున్న కాలంలో భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రధాని మోదీ సభలు ఉంటాయని తెలిపారు. అనంతరం భట్టు రమేష్ తదితరులు బీజేపీలో చేరారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఊకె అబ్బయ్య, కుంజ సత్యవతి, నాయకులు దేవేంద్ర వరప్రసాద్, ఎడ్లపల్లి శ్రీనివాస్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ, సీతారాం నాయక్, ముస్కు శ్రీనివాస్, ఖాజాపాషా, నాళ్ల సోమసుందర్, గుగులోతు రాంచందర్ నాయక్, బలగాని గోపీకృష్ణ, మురళీకృష్ణ, రాంచందర్ నాయక్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందు నిలవాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఖమ్మంలో జనసేవాదళ్ శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడుతూనే మతోన్మాద శక్తులను నిలువరించడంలో జన సేవాదళ్ కార్యకర్తలు ముందు వరుసలో నిలవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సూచించారు. సామాన్యుల ఆస్తుల పరిరక్షణ, మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు చంద్ర రాజేశ్వరరావు జన సేవాదళ్‌ను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఖమ్మంలో జనసేవాదళ్ శిక్షణను ఆదివారం ఆయన ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జన సేవాదళ్ కార్యకర్తలతో కలిసి పరేడ్ నిర్వహించాక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్, అనుబంధ సంస్థలు ప్రజల మధ్య చిచ్చు రేపుతున్న ఈ సమయంలో జన సేవాదళ్ కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కులం, మతం ప్రాతిపదికన బీజేపీ వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. భూపోరాటాలలో ప్రజలకు అండగా నిలుస్తూనే ప్రజా ఆందోళనలు, ఉద్యమాలకు అండగా నిలవాలని తెలిపారు. కాగా, సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 2024లో ఢిల్లీలో లక్ష మందితో కవాతు నిర్వహించాలనే లక్ష్యంతో ఖమ్మంలో శిక్షణ ప్రారంభించినట్లు చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో తర్ఫీదు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్.కే.జానీమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, ఇటికాల రామకృష్ణ, వానబాల రామకృష్ణ, తాటి నిర్మల, పగిడిపల్లి ఏసు, గాదె లక్ష్మీనారాయణ, బోడా వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఓసీలో పర్యావరణ బృందం పర్యటన



కేఓసీ కార్యాలయం వద్ద అధికారులు

టేకులపల్లి: సింగరేణి ఇల్లెందు ఏరియా టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓపెన్‌కాస్ట్‌ను పర్యావరణ బృందం సైంటిస్ట్ సుదీప్తియా ముఖోపాధ్యాయ ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా సభ్యులు 2018–19 నుండి కోయగూడెం ఓసీలో పర్యావరణ సమతుల్యతకు అవలంబిస్తున్న చర్యలను పరిశీలించారు. అనుమతుల వారీగా జరుగుతున్న పనులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్, అధికారులు సౌరభ్ సుమన్, ఏరియా ధనుంజయరెడ్డి, తిరుపతి, పోశమల్లు, రామరాజు, శ్రీకాంత్ పాల్గొనారు.

ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్య



వినోద్ (ఫైల్)

ఇల్లెందురూరల్: ప్రేమ విఫలమైందనే ఆవేదనతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇల్లెందు ఎస్సై గిరిధర్ రెడ్డి కథనం ప్రకారం.. ఇల్లెందు మండలం పోలారం గ్రామానికి చెందిన వినోద్(25) మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని దివ్యాంగుల విభాగంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. పోలారం గ్రామానికే చెందిన ఓ యువతితో ఆయన ప్రేమలోపడగా, యువతి తండ్రి వినోద్‌ను హెచ్చరించాడు. దీంతో మనస్తాపం చెంది 20 రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు యువతి కుటుంబానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దొంగల దాడిలో డ్రైవర్‌కు గాయాలు

గుంటూరు జిల్లా వినుకొండలో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లాల్‌సింగ్

టేకులపల్లి: లారీ డ్రైవర్, టేకులపల్లి మండల వాసి దొంగల దాడిలో గాయపడ్డ సంఘటన ఏపీలోని గుంటూరు జిల్లా వినుకొండలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. టేకులపల్లి రేగులతండాకు చెందిన ఇస్లావత్ లాల్‌సింగ్ అదే గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం బొగ్గు లోడ్‌తో కర్నూల్‌కు వెళ్లాడు. అన్‌లోడింగ్ తర్వాత తిరిగివస్తుండగా కర్ర లోడింగ్ ఉండటంతో గుంటూరు జిల్లా వినుకొండకు వెళ్లాడు. అక్కడే పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్ స్థలంలో లారీ నిలిపి ఉంచాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున దొంగలు లారీ స్పేర్‌పార్టులను చోరీ చేసేందుకు వచ్చారు. అలికిడికి డ్రైవర్లు మేల్కొనడంతో దొంగలు పారిపోతూ డ్రైవర్లపై రాళ్లు విసిరారు. దీంతో లాల్‌సింగ్ కంటికి తీవ్ర గాయమైంది. స్థానికులు నరసరావుపేట ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఖమ్మం వ్యాపారి అమెరికాలో మృతి



నాగేశ్వరరావు(ఫైల్)

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం 25వ డివిజన్ రిక్కాబజార్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి, సాయిబాబా ట్రస్ట్ సభ్యుడు, కాంగ్రెస్ సానుభూతిపరుడైన పసుపర్తి నాగేశ్వరరావు(65) ఈనెల 4వ తేదీన అమెరికాలో మృతి చెందారు. దీంతో ఆయన మృతదేహాన్ని ఆదివారం ఖమ్మంకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన ఇద్దరు కుమారుల్లో ఒకరు హైదరాబాద్, ఇంకొకరు అమెరికాలో నివసిస్తున్నారు. కాగా, ఆదివారం ఖమ్మంకు నాగేశ్వరరావు మృతహాన్ని తీసుకురాగా కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, దాసరి పూర్ణ, రాధాకృష్ణ, సోమనాథం, జంగిలి నాగేశ్వరరావు, కృష్ణమూర్తి తదితరులు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

పరస్పర దాడుల్లో ఒకరికి గాయాలు

కారేపల్లి: భూవివాదం నేపథ్యాన పాతకక్ష్యలను దృష్టిలో పెట్టుకుని ఇరువర్గాలు ఘర్షణకు దిగగా ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోనిసూర్యతండాకు బంధువుల నడుమ భూమి విషయమై కొన్నేళ్లుగా వివాదం జరుగుతోంది. ఈనేపథ్యాన ఆదివారం రెండు వర్గాలు ఇనుపరాడ్లతో దాడులు చేసుకోవటంతో ఒకరి తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయనను ఖమ్మం తరలించారు. కాగా, ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మహిళపై కోతుల మూకుమ్మడి దాడి

నేలకొండపల్లి: ఓ మహిళపై కోతులు మూకుమ్మడిగా దాడి చేయటంతో తీవ్రంగా గాయపడింది. మండలంలోని మోటాపురానికి చెందిన చావా ధనమ్మ ఇంటి వద్ద ఉండగా ఆదివారం కోతుల ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయాలు కాగా స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు.